అటకెక్కిన నిషేధం

- కమ్మేస్తున్న ప్లాస్టిక్
- ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం
- పట్టించుకోని వ్యాపారులు
- నిద్రావస్థలో జిల్లా యంత్రాంగం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులపై ప్రభుత్వం నిషేధం విధించింది. నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలను నియంత్రించాల్సిన నగరపాలక సంస్థ, ఆహార కల్తీ నిరోధకశాఖ నిద్రావస్థలో ఉన్నాయి. ప్రతినెలా నగరపాలక, పురపాలిక ప్రాంతాల్లోని వాణిజ్య కూడళ్లల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని తిరిగి అమ్మకాలు జరగకుండా అపరాధ రుసుము విధించాలి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 125 మైక్రాన్లుకు పైగా మందం కలిగిన పాలిథిన్ సంచులనే విక్రయించాలి. ఆ లోపు ఉన్నవి నిషేధించాలని స్పష్టం చేసింది.

జిల్లాలోని నగరపాలక, పురపాలికల్లో ఎక్కడా ప్లాస్టిక్ నిషేధిత వస్తువులపై నియంత్రణ లేకపోవడంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు, వినియోగాన్ని అరికట్టాల్సిన పురపాలిక, నగర పాలిక అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి, తూనికలు-కొలత, ఆహార కల్తీ నిరోధకశాఖ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కూరగాయాల మార్కెట్, చేపల మార్కెట్, అంగళ్లు, హోటళ్లు ఒక్కటేమిటి అన్నిచోట్ల విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు యధ్దేచ్ఛగా సాగిపోతోంది.

ప్లాస్టిక్ వినియోగం ఏ మేరకు ఉందో నగరపాలక, పురపాలికల్లో సేకరిస్తున్న చెత్తసేకరణనే సాక్ష్యంగా నిలుస్తోంది. పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్న చెత్తలో 20 నుంచి 30 శాతం నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులే దర్శనమిస్తున్నాయి. చెత్తకుప్పల్లో పోగుపడి అక్కడ నుండి డంపింగ్ యార్డులకు చేరి చివరికి భూమిలో కరిగి నీరు, వాయు, భూ కాలుష్యానికి దారితీస్తున్నాయి. ఇటీవల చిత్తూరు డంపింగ్ యార్డుకు నిప్పు అంటుకోవడంతో ఆర్పేందుకు మూడు రోజులు పట్టింది. డంపింగ్ యార్డు నుంచి వచ్చే దట్టమైన పొగతో చుట్టుపక్క ప్రాంతాలైన సంతపేట, మంగసముద్రం, ఓబనపల్లి ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చింది.

ప్రజారోగ్యానికి హాని కలిగించకుండా ఉండే 75 మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్లకు అనుమతించింది ప్రభుత్వం. అయితే 2022లో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధించారు. ఇదిలా ఉంటే రోజుకు ఒక్క చిత్తూరు నగరంలోనే 4 నుంచి 5వేల కిలోలు, పలమనేరు, కుప్పం, నగరి, వంటి పురపాలికల్లో 3 నుంచి 4 వేల కిలోల ప్లాస్టిక్ కవర్లు విక్రయాలు సాగుతున్నాయి. మిగిలిన చిన్నచిన్న పట్టణాల్లో 50 నుంచి 100 కేజీల నిషేధిత ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం.

నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలను నిరోధించాల్సిన అధికారులు పైపై దాడులకు పరిమితమవుతున్నారు. ఆదేశాలు వచ్చిన రోజు మాత్రమే ఆర్భాటంగా దాడులు చేయడం, కేసులు నమోదు చేసి జరిమానా విధించడం తప్ప కఠినంగా వ్యవహరించడం లేదు. ఇటు తయారీ పరిశ్రమలపైనే దాడులు చేసి వాటి ఉత్పత్తినే నిలిపేస్తే చిల్లర దుకాణాలు, మార్కెట్లలో దాడులు చేయాల్సిన అవసరం ఉండదని ప్లాస్టిక్ కవర్ల విక్రయించేవారు, కొనుగోలుదారులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా సంచులు మార్కెట్లో సరసమైన ధరలకు అందుబాటులో లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ప్లాస్టిక్ కవర్లను కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ నిషేధిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలపై పూర్తిస్థాయిలో దాడులు చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత నగర పాలక, పురపాలిక, గ్రామ పంచాయతీలు, సచివాలయాలపై ఉంది.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి

- అనిల్ కుమార్ నాయక్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వాడకంపై ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రత్యామ్నాయ బ్యాగులు అందుబాటులో ఉంచుతున్నాం. నిషేధిత ప్లాస్టిక్ కవర్లపై దాడులు చేస్తున్నప్పటికీ ప్రజలు కొనుగోలు చేయడం వల్ల అదుపు చేయడం కష్టంగా మారుతుంది. ప్రజారోగ్యం కోసం నిషేధిత ప్లాస్టిక్ కవర్లు ఇతర వస్తువులను విక్రయిస్తున్న వారిపై జరిమానాలు విధించడం జరుగుతోంది.

పర్యావరణాన్ని కాపాడాలి

- నేచర్ మురళి, ప్రకృతి ప్రేమికుల సంఘం జిల్లా నాయకులు

పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ముఖ్యంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లపై నగరపాలక అధికారులు చర్యలు తీసుకోవాలి. ఒక్క ప్లాస్టిక్ కవర్లే కాకుండా ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలను అరికట్టి బాధ్యతగా వ్యవహరించాలి. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది.

పక్కాగా మంత్రి పర్యటన ఏర్పాట్లు : జెసి

మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈనెల 20వతేదీ శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించడంతోపాటు మండలంలోని నల్లగాడు కోటూరు గ్రామంలో నిర్వహించన్ను ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పాల్గొంటారని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. గురువారం మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. అధికారులందరూ సమన్వయంతో మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్‌డిఓ మనోజ్‌కుమార్ రెడ్డి, తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, ఎంపిడిఓ శివశంకర్, సిఐ శ్రీనివాసులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా మండలంలోని ప్రధాన మార్గాల్లో టిడిపి నాయకులు స్వాగత తోరణాలు, ప్లెక్సీలను ఏర్పాటు చేశారు.

సమయపాలన పాటించాలి: కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ మిట్టూరు మస్టర్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్టర్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదు తనిఖీ చేశారు. వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. పారిశుద్ధ్య కార్మికులు, మేస్త్రీలు, వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు నిర్దేశించిన సమయం క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని, పనుల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం కనిపించరాదన్నారు.

పారిశుధ్య నిర్వహణలో మార్పు కనిపించాలి..

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రత్యేక మార్పు కనిపించాలని, కంటికి కనిపించేలా పారిశుధ్యం మెరుగుపరచాలని కమిషనర్ స్పష్టం చేశారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా అపరిశుభ్ర పరిసరాలు కనిపించరాదని, ప్రధానంగా డంపర్ బిన్లు సకాలంలో క్లియర్ చేసి శుభ్రంగా ఉంచాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య లోపం కనిపిస్తోందని ప్రత్యేకచర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన పుష్కాట్లు, డబ్బాలు, డంపర్ బిన్లు ఇతర అవసరమైన పరికరాలు ఎన్ని అవసరమో వార్డు వారిగా నివేదించాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) చిత్తూరు కమిటీ ఆధ్వర్యంలో నూతన కమీషనర్ కలిసి విన్నవించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కారం కోసం గతంలో అధికారులను పదేపదే కలిసినా ఫలితం లేదని, తమరైన పరిష్కారం చేయాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులుగా ఎక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారని, వారికి రకరకాల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అలాగే ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ఎప్పుడైనా తనని కలువచ్చు అని తెలిపారు. అలాగే ప్రస్తుతం ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

వార్డు సచివాలయ కార్యదర్శులకు

నేడు బదిలీల కౌన్సెలింగ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పుర/నగర పాలకల్లోని వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ఈనెల 20వ తేదీ శుక్రవారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో జరుగుతుందని నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న వార్డు కార్యదర్శులు ఉదయం ఎనిమిది గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. నగరపాలక కార్యాలయంలో వీసీ హాల్లో వార్డు అడ్మిన్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్, వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్, అమినిటీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్, అంతర్ జిల్లా బదిలీల కోసం ప్రత్యేకంగా టేబుల్స్, అధికారులను, సిబ్బందిని కేటాయించారు. కౌన్సెలింగ్ సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కగా చేయాలని అధికారులను ఆదేశించారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

ప్రజాశక్తి- పుంగనూరు: గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పుంగనూరు మండలంలో ఏడాది పాటు జరిగిన అభివృద్ధి పనులు, జాబ్ కార్డు హోల్డర్లకు అందించిన బిల్లులపై సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయని ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు గురువారం ఓప్రకటనలో తెలిపారు. పుంగనూరు మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి 9 కోట్ల 57 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. వీటిలో సిమెంట్ రోడ్లు, కాలువలు, భవనాలు నిర్మాణాలకు నాలుగు కోట్లు ఖర్చు చేయగా, 5 కోట్ల 57 లక్షలు కూలీలకు చెల్లించడం జరిగిందన్నారు. దీనిపై వారం రోజులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి చివరి రోజున బహిరంగ సభ నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి పుంగనూరు మండలంలో 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్ తొలగించడం జరిగింది. తిరిగి వాటిని భక్తి చేయడం జరిగిందన్నారు. గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించవలసిందిగా కోరారు.

పంటలపై ఏనుగుల దాడి

టమోటా, వరి, మామిడి పంటలకు నష్టం

అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగు, వరి పంట పై నడిచి వెళ్లిన ఆనవాళ్లు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నెరుకూరివారిపల్లె గ్రామ సమీపంలోని పంట పొలాలపై బుధవారం అర్ధరాత్రి ఏనుగులు దాడిచేసి వరి, టమోటా, మామిడి పంటలకు తీవ్ర నష్టం కలిగించాయని రైతులు తెలిపారు. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు జరిగిన నష్టాన్ని గుర్తించి అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. తరచూ ఏనుగులు చేతికి అంది వచ్చిన పంట పొలాలపై దాడులు చేస్తూ తమకు ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నాయని, బోరు మోటార్లు తగిలించి వేయడం పైపులు తొక్కి వేస్తున్నాయని ఇకనైనా ఏనుగుల బెడద నుండి కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పలమనేరు పరిసరాల్లో ..

డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు:ఎంవిఐ

ప్రజాశక్తి- పలమనేరు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంవిఐ మధుసూధన్

పలమనేరు పరిసర ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూధన్ మీడియాతో మాట్లాడారు. 80 శాతం ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యంతో జరుగుతున్నాయని గుర్తించామన్నారు. దూర ప్రయాణాలు చేసేటప్పుడు నిద్ర లేకుండా వాహనాలు నడిపే సమయంలో నిద్రమత్తులోకి జారి ప్రమాదాలకు గురవుతున్నట్లు దర్యాప్తులో గుర్తించామన్నారు. మరికొన్ని ప్రమాదాలు మద్యం మత్తులో జరుగుతున్నట్లు ఎంవీఐ మధుసూదన్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ఎప్పటికప్పుడు డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డ్రైవింగ్ టెస్టులకు, లైసెన్స్ రెన్యువల్‌కు వచ్చే డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విలేజ్ లిమిట్ పాటించకుండా అధికవేగంతో నడిపే వాహనదారులకు లైసెన్సు రద్దు చేయడమే కాకుండా భారీ జరిమానాలు విధిస్తామని ఎంవీఐ మధుసూదన్ హెచ్చరించారు.

'యువగళం' తొలి మైలురాయి హామీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మంత్రి లోకేష్ చేతుల మీదుగా కిడ్నీ డయాలసిస్ యూనిట్‌ను బంగారుపాళ్యంలో శుక్రవారం ప్రారంభించనున్నారు. ఉమ్మడి చిత్తూరులో యువగళం తొలి మైలురాయి హామీకి కార్యరూపం దాల్చనుంది.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో యువనేత లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. యువగళం పాదయాత్ర 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా 2023, ఫిబ్రవరి 3న బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పట్లో శిలాఫలకం ఆవిష్కరించారు. ఇచ్చిన మాట ప్రకారం బంగారుపాళ్యంలో రూ.3 కోట్ల వ్యయంతో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రస్తుతం రోజుకు 10మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ నిర్వహించే అవకాశం ఉంది. భవిష్యత్తులో అవసరాన్ని బట్టి ఈ యూనిట్ సామర్థ్యాన్ని పెంచుతారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ యూనిట్ ను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా యువగళం సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 100 కి.మీ. కి ఒకటి చొప్పున 5 మైలురాళ్ళను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. మిగిలిన హామీల అమలుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. హామీలకు సంబంధించి ఆయా శాఖల మంత్రులు, అధికారులతో నిరంతరం చర్చలు జరుపుతున్నారు. సాధ్యమైనంత త్వరగా యువగళం హామీల అమలుకు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారని టిడిపి శ్రేణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ ముందుగానే గురువారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు.

నేడు డయాలసిస్ యూనిట్ ప్రారంభం

డయాలసిస్ యూనిట్ ప్రారంభించనున్న పిహెచ్‌సి

పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో వ్యవసాయ అనుబంధ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి, ఇండస్ట్రియల్ క్లస్టర్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ వివరించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో స్వర్ణాంధ్రా ఏ 2047కు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా సచివాలయం నుండి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో వ్యవసాయ అనుబంధ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి, ఇండస్ట్రియల్ క్లస్టర్ల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్వర్ణ ఆంధ్రా ఏ2047 లక్ష్య సాధన కోసం మండల స్థాయి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇందుకోసం ఈనెల 23 సోమవారం నుండి మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించేలా చర్యలు చేపట్టి ఈనెల 30వ తేదీలోపు నివేదికను అందజేయాలన్నారు. జిల్లా స్థాయిలో సమీకృతం చేసి నివేదికను అక్టోబర్ 15వ తేదీ లోపు సిద్ధం చేయాలని, అమలు విధానంలో ఐదేళ్ళ దీర్ఘకాలిక వ్యూహం అమలు చేసేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. ఆ మేరకు రాష్ట్రస్థాయిలో నవంబర్ ఒకటవ తేదీన రాష్ట్రస్థాయిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రానున్న ఐదేళ్ళ కాలంలో 2024 -2029 వరకూ ఒక విజన్‌తో కూడిన నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, జెడ్‌పి సీఈవో గ్లోరియా, సిపిఓ సాంబశివారెడ్డి, హౌసింగ్ డిఆర్‌డిఏ, మెప్మా, పిడిలు పద్మనాభం, తులసి, రాధమ్మ, వ్యవసాయ పశుసంవర్ధక శాఖల జిల్లా అధికారులు మురళీ కృష్ణ, డాక్టర్ ప్రభాకర్, డీఈవో దేవరాజు, డిపిఓ లక్ష్మీ, బీసీ సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు రబ్బానీ బాష, రాజ్యలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి భక్తుల మనోభావాలతో...

లడ్డూ రాజ'గీ'యం..!

- సిఎం వ్యాఖ్యలపై దుమారం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం అత్యున్నత హిందూ ధార్మిక సంస్థ.. హిందుత్వాన్ని కాపాడటంలో ఎపుడూ ముందుంటుంది.. ఒకవేళ ఏదైనా జరిగినా వేలాది మంది ఉద్యోగులకు, ఉన్నతాధికారులకు తెలియకుండా జరిగే అవకాశమే లేదు.. లడ్డు పోటులో పనిచేసే వందలాది మంది కార్మికులకు తెలియక పోదు.. తిరుమల లడ్డులో వాడే నెయ్యి విషయంలోనూ అంచెలంచెలుగా తనిఖీలు ఉంటాయి.. ల్యాబ్‌లలో పరీక్షించే నెయ్యిని ఉపయోగిస్తారు.. ఒకవేళ అడపాదడపా ఏదైనా పొరబాటు జరిగి ఉంటే అప్పటికప్పుడు చర్యలు తీసుకుని, నాణ్యమైన నెయ్యిని వాడేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే అలా కాకుండా ముఖ్యమంత్రి స్థాయిలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా 'రాజకీయం'గా ఈ విషయాన్ని వాడుకోవడం విమర్శలకు తావిస్తోంది. వైసిపి పాలనపై బురద చల్లాలన్న అత్యుత్సాహంతో భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా టిడిపి కూటమి వ్యవహరిస్తోందన్నది మెజార్టీ రాజకీయ వర్గాల భావన. స్వయానా సిఎం చంద్రబాబునాయుడు శ్రీవారి లడ్డూలకు వాడే నెయ్యిలో ఆవు కొవ్వు కల్తీ ఉందని వ్యాఖ్యలు చేయడంపై భక్తులే కాదు ఉద్యోగులు సైతం నివ్వెరపోతున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన వైసిపి నుంచి అంతే స్థాయిలో ఘాటైన ఖండన వస్తోంది. ఏదిఏమైనా సిబిఐ విచారణ జరిపి, ఒకవేళ నిగ్గు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలే తప్ప, భక్తుల మనోభావాలతో ఆడుకోవడం సరికాదన్నది విజ్ఞుల వాదన.

లడ్డు తయారీలో వాస్తవ పరిస్థితి

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏ ప్రసాదం తయారీకైనా దానికి వినియోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి టిటిడి పరిధిలో ల్యాబ్ ఉంటుంది. పదార్థాలను తనిఖీ చేసిన తరువాతనే వినియోగిస్తారు. సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిఎఫ్‌టిఆర్ఐ, మైసూరు) పరిధిలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తారు. ఇది కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నడుస్తోంది. విశ్రాంత శాస్త్రవేత్త, మరో 12 మంది నిపుణులైన ఉద్యోగుల పర్యవేక్షణలో ఈ తనిఖీ జరుగుతుంది. ఈ తనిఖీ పర్యవేక్షణకు టీటీడీ నుంచి రోజుకొక బందం చొప్పున ప్రతిరోజూ సర్టిపై చేసిన తర్వాతనే ప్రసాదాలకు వినియోగించే ఆహార పదార్థాలను స్వీకరిస్తారు. టిటిడి నాణ్యతా ప్రమాణాలకు లోబడే నెయ్యి వినియోగం ఉంటుంది. కరోనా సమయంలో మినహా మిగిలిన మూడున్నర సంవత్సరాల కాలంలో వైసిపి హయాంలో నెయ్యి వినియోగానికి సంబంధించిన ట్యాంకర్లు నాణ్యతా ప్రమాణాలకు లోబడి లేవని పరీక్షల్లో తేలడంతో 20కి పైగా ట్యాంకర్లను తిప్పి పంపిన విషయమూ రికార్డుల్లో నమోదై ఉండటం గమనార్హం.

ఉద్యోగులను అవమానించడమే : కందారపు మురళి

తిరుమల కొండపై లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును వినియోగిస్తున్నారని స్వయంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం టిటిడి ఉద్యోగులను అవమానించడమేనని టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో విమర్శించారు. టీటీడీలో పారదర్శకమైన విధానాలు ఉన్నాయని, ఏ ప్రసాదం తయారీకైనా దానికి వినియోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేయడానికి టీటీడీ పరిధిలో ల్యాబ్ ఉందని, ఈ ల్యాబ్ లో తనిఖీలు చేసిన తర్వాతనే వినియోగిస్తారని గుర్తు చేశారు. వాస్తవం ఇది కాగా ముఖ్యమంత్రి స్థాయిలోని వ్యక్తి తేలికగా ఇట్లాంటి ఆరోపణలు చేయటం సమంజసం కాదని భక్తుల మనోభావాలను, టీటీడీ ఉద్యోగులను అవమానించినట్లే అవుతుందన్నారు. ఏదైనా అక్రమ వ్యవహారాలకు సంబంధించి తప్పులు ఉంటే బాధ్యులను కఠినంగా శిక్షించడానికి ఎవరికీ అభ్యంతరం లేదని, తన ప్రత్యర్థులను దెబ్బతీయాలనే పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపిక చేసుకున్న మార్గం సరైంది కాదని హితవు పలికారు.

శివసేన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : పార్లమెంట్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శివసేన ఎమ్మెల్యే షిండే పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్, నగర అధ్యక్షులు టిక్కీ రాయల్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుట్రపూరిత రాజకీయాలతో మతవిద్వేషాలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన బిజెపి దేశంలో అరాచకాన్ని సృష్టిస్తోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చడమే ప్రధాన అజెండాగా బిజెపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కాంగ్రెస్ పార్టీ తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. అనంతరం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

టి పుత్తూరులో పొలంబడి

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని టి పుత్తూరు గ్రామంలో మేలైన యాజమాన్య పద్ధతులు పొలంబడి కార్యక్రమాన్ని ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె వేరుశనగలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. పస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో 20 గ్రాముల యూరియాను ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకుంటే కొంత వరకు పంటను కాపాడుకోవచ్చు అన్నారు. దిగువమొదలపల్లిలో డ్రం సీడర్ విత్తిన వరి పంటను పరిశీలించారు. వరి పంటలో బ్యాక్టీరియా తెగుళ్లను గుర్తించి, వాటి నివారణకు 2గ్రాముల కార్బెండిజం మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మండల వ్యసాయాధికారి జి. ప్రవీణ్, ఆర్‌బికె సిబ్బంది శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేసుకోవాలి

జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీ ప్రసన్న

ప్రజాశక్తి బంగారుపాళ్యం: భూసార పరీక్షలు చేసి పంటలను సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీ ప్రసన్న అన్నారు. గురువారం మండలంలోని మహాసముద్రం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ప్రతికూల పరిస్థితులపై అవగాహన సదస్సు ఏఈఓ సాదరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపే విధంగా చూడాలని ముందస్తు భూమిని భూసార పరీక్షలు చేయించి తగిన పంటను ఎంచుకోవాలని తద్వారా దిగుబడి అధికంగా వస్తుందన్నారు. వర్షం లేక సాగునీరు అందక ఎండుతున్న వేరుశనగ పంటకు 10 గ్రాముల యూరియా ద్రావాన్ని 10 గ్రాముల మిథలిక్కే మిశ్రమాన్ని ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకుంటే బెట్టను తట్టుకుని దిగుబడి అధికంగా వస్తుందని వేరుశనగ రైతులు ఈ పద్ధతిని అవలంభించాలని సూచించారు. మండల ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

4వ విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థలో నిర్వహించే నాల్గొవ విడత కౌన్సెలింగ్‌ను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న కోర్సులకు నాల్గొవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను కళాశాలలో అందించాలన్నారు. 28వ తేదీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు తమ విద్యార్హత సర్టిఫికేట్లతో పాటు, కుల ధృవీకరణ పత్రాలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరుకావాలని సూచించారు. అలాగే మహిళలకు టైలరింగ్ ట్రేడ్‌లో ప్రత్యేకశిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 91600 12999కు సంప్రదించాలని కోరారు.

అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: డిసిసిబి ఎంప్లాయిస్ యూనియన్‌కు కొత్త అధ్యక్షులుగా రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా గంగిరెడ్డి ఎంపికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలకు గురువారం సింగిల్ విండో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, జాయింట్ సెక్రెటరీ రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు శ్రీధర్, కమిటీ మెంబర్ మురుగన్ ఘన సన్మానం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1,2 బృందాలు పి.అశోక్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఎస్.జాకీర్ ఆధ్వర్యంలో చిత్తూరులోని తప్పవనం విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూరిని పెంపొందించేలా చెస్, కేరమ్స్, ఖోఖో, కబడ్డీ క్రీడలతోపాటు ఆత్మరక్షణ విద్యను నేర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.గజలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి సహకరిస్తాం

కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం మండలం ఆవులనత్తం గేటు ప్రాంతంలో నూతనంగా ఏర్పడ్డ కాలనీలో నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, పార్టీ సీనియర్ నాయకులు చలపతి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కాలనీ పరిధిలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా, ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ సమస్య ఏర్పడిందని, గత ప్రభుత్వంలో మంజూరు అయిన ఇండ్లకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వీటిపై స్పందించిన నాయకులు సమస్యలను ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌ల దృష్టికి తీసుకెళ్లి, వారి సహకారంతో సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. క్లస్టర్ ఇన్చార్జి గోపనపల్లి రవి, యూనిట్ ఇన్చార్జి లీలా వెంకటేష్, సామిడి, శివరాజు పాల్గొన్నారు.

కాలనీవాసులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వందరోజుల్లో గురజాల మార్క్ పాలన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

గురజాల జగన్మోహన్ అనే నేను.. అంటూ అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి శుక్రవారానికి వంద రోజులు పూర్తికా వస్తోంది. వంద రోజులపాటు చిత్తూరు నియోజకవర్గంలో గురజాల జగన్మోహన్ జనరంజక పాలనకు 100 రోజులు.. అసాధ్యాన్ని సాధ్యంగా చేస్తూ, సమర్థవంతమైన నిర్ణయాలతో, ఎవ్వరికీ సాధ్యం అవ్వని రీతిలో.. అభివృద్ధి పథంలో... సాగుతున్న కూటమి ప్రభుత్వంలో తాను కూడా భాగమై.. చిత్తూరు నియోజకవర్గం దశ దిశ మారుస్తూ చరిత్రలో నిలిచిపోయేలా సాగింది ఎమ్మెల్యే 100 రోజుల పాలన.

దశాబ్దాల కళ చిత్తూరులో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అనుమతులు ఏర్పాటు దిశగా తొలి అడుగు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం ప్రకటన అనంతరం రాష్ట్రంలోనే మొదటి అన్న క్యాంటీన్ మన చిత్తూరులో ప్రారంభం. నగర సుందరీకరణలో భాగంగా చిత్తూరునగర పరిధిలో గల చెరువుల సుందరీకరణ, మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు చర్యలు. ప్రయాణికుల సౌకర్యార్థం చిత్తూరు ఆర్టీసీ డిపో 2లో నూతన బస్సులు ప్రారంభం. నియోజకవర్గంలో మామిడి రైతులకు బాసటగా గిట్టుబాటు ధర కల్పించాల్సిందిగా పండ్ల గుజ్జు తయారీ యాజమాన్యం వారికి ఆదేశాలు, అమలు. జనంలో జిజేయం పేరుతో నెలలో 2 సార్లు నగరంలోని వార్డులలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే అధికార యంత్రాంగంతో చర్చించి తగు సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు. భరోసా" పథకం కింద పెంచిన సామాజిక పింఛన్లను నేరుగా లబ్దిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి పంపిణీ కార్యక్రమం. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ స్థాయి సంఘం తొలి సమావేశంలోనే గత అయిదేళ్ల వైసీపీ

జెడ్‌పి సమావేశంలో ప్రజాసమస్యలపై మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

పాలనలో చిత్తూరుకు జరిగిన అన్యాయంపై గళమెత్తడం.. అభివృద్ధికి ప్రతిపాదనలు చేయడం.తనదైన మార్కు అభివృద్ధి పాలనతో ప్రజల మన్ననలు పొందుతూ తనదైన శైలిలో ప్రత్యర్థి పార్టీ సభ్యులు అధికంగా ఉన్న చిత్తూరు కార్పొరేషన్ కైవసం... చిత్తూరు నగర అభివృద్ధికి తోడ్పాటు. చిత్తూరు పాత బస్టాండు మరియు రైతు బజార్లు సందర్శించి ఆధునీకరణ చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు. నూతన ఇసుక విధానం ప్రారంభం మరియు పర్యవేక్షణ. చిత్తూరు నగర సమీపాన పూణేపల్లి వద్ద గల టిడ్కో ఇళ్ల సముదాయాలను సందర్శించి అతిత్వరలో లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ కార్యక్రమానికి హామీ.

చిత్తూరు నగర పరిధిలోని 14వ వార్డు స్థానిక ప్రశాంత్ నగర్ కాలనీ వద్ద ముస్లీం మైనార్టీ సోదరుల పవిత్ర ప్రార్థనల సౌకర్యార్థం పవిత్ర ఈద్గా నిర్మాణానికి భూమి పూజ. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి గురువారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం. ఉదయం హామీ ఇచ్చి సాయంత్రానికి నీటి బోరు వేయించి స్కూల్ విద్యార్థుల దాహార్తిని తీర్చారు అలాగే ఇప్పటి వరకూ నియోజకవర్గ వ్యాప్తంగా 20కి పైగా తాగునీటి బోర్లను వేయించారు. చిత్తూరు నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల కొరకు బెంగళూరుకు చెందిన రీయూజబుల్ బ్యాగుల తయారీ సంస్థకు ఆహ్వానం. చిత్తూరు నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవడంలో కీలక పాత్ర పోషించారు.

ఎలక్ట్రిక్ వాహనాల వాడకంలో చిత్తూరు రాష్ట్రానికి ఆదర్శనవ్వాలనే నినాదంతో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై చిత్తూరు నియోజకవర్గం ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను ఎలక్ట్రిక్ వాహనాల ర్యాలీ నిర్వహణ. బోడికొండ శ్రీవరప్రదాయ వేంకటేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణం కొరకు 51లక్షల విరాళం. ముఖ్యమంత్రి ఆదేశానుసారం విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి బాధితుల సహాయార్థం చిత్తూరు నియోజకవర్గ ప్రజలు జిజెయం చారిటబుల్ ఫౌండేషన్‌కు అందజేసిన బాధితులకు నిత్యావసరాలు అందజేత. త్వరలోనే చిత్తూరు ఫారెస్ట్ రోడ్డు అభివృద్ధి. నియోజకవర్గంలోని సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు, అమలు. పీవీకేఎన్ కళాశాల మొదటి ప్రణాళిక, అభివృది సంఘం సమావేశంలోనే కళాశాల అభివృద్ధికి వరాల జల్లులు. ఇంకా మరెన్నో అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు తోడుగా నిలుస్తూ చిత్తూరు ప్రజల మనసును గెలుస్తున్న ప్రజానేత ఎమ్మెల్యే.

ఉత్తమ విద్యతోనే దేశాభివృద్ధి

ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ఉత్తమ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. కుప్పం పట్టణంలోని టేలర్ హై స్కూల్‌లో పూర్వపు విద్యార్థుల సంఘం తరపున కరస్పాండెంట్ డాక్టర్ సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్, మ్యాస్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తో పాటు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ హెడ్ సురేష్, పాఠశాల కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థుల కెప్టెన్‌గా ఎన్నుకోబడిన గిరీష్‌ను, అలాగే వివిధ తరగతులలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్సీ ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం విద్యార్థుల భరతనాట్యం సభికులను ఆకట్టుకుంది. చివరగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రయోగాలను ముఖ్యఅతిథులు పర్యవేక్షించారు. కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, డాక్టర్ వెంకటేష్, గోపీనాథ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన ఎంపిడిఓ

ప్రజాశక్తి- విజయపురం: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపిడిఓ చంద్రమౌళి సూచించారు. గురువారం స్థానిక సచివాయంలో ఎంపిడిఓ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలోని సచివాలయ సిబ్బంది సమయానికి కార్యాలయానికి రావాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారించాలని ఆదేశించారు. ఏదైనా పని విషయమై బయట వెళ్లే సిబ్బంది మూమెంట్ రికార్డులలో నమోదు చేసుకోవాలని సూచించారు. సమయపాలన పాటించని వారిపై, ఎలాంటి అనుమతి లేకుండా సచివాలయం వదిలి బయట వెళ్లిన వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉలవలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని 12 రైతుసేవా కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ఉలవల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి వనిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులకు 10 కేజీల ఉలవల విత్తనాలు రూ.175లకు అందింస్తున్నామని, అవసరమైన వారు ఆర్‌బికెలో పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ కార్డుతో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి రైతు ఈ పంట నమెదు చేసుకోవాలని సూచించారు. ఈ పంట నమోదు కార్యక్రమం ఈనెల 23 నాటికి ఆఖరి తేదీ కనుక ప్రతి రైతు వారి పంటలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి ప్రోత్సాహంతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వరద బాధితుల సహాయ నిధి రూ.5116లను సేకరించి సిఎం సహాయ నిధికి జమచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలసుబ్రహ్మణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సీఎం లతా, జోగి ప్రసాదు, భార్గవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మేలుమై పంచాయతీలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిని హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఏడీ పద్మజ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వరి, రాగి, వేరుశనగ పంటలు పండించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రస్తుత పరిస్థితులలో ఎలాంటి ఎరువులు వాడాలి వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్‌బికే అధికారి రాజశేఖర్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చేపట్టాలని నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్ చెప్పారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మిట్టూరులోని ఆలయం వద్ద శుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, స్థానికులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి ఈ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతిఒక్కరూ సహకరించాలని, వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. గురువారం నగరంలోని అన్ని ప్రార్థనా స్థలాలు, ఆలయాల వద్ద ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : మండలంలో రేపటి నుంచి అక్టోబర్ 1వరకు జరిగే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మోహన్ మురళి పంచాయతీ కార్యదర్శులను కోరారు. షెడ్యూల్ ప్రకారం పంచాయతీలలో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తూ వాటికి సంబంధించిన వీడియోలను ప్రభుత్వానికి పంపాలన్నారు. పంచాయతీల వారీగా వీటిపై సమీక్షలు నిర్వహించారు. ఎలా నిర్వహించాలనేదానిపై ఈవోపీఆర్డి పురుషోత్తం సూచనలు ఇచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ లోకనాథ పిళ్లై, ఏవో కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురంలో..

గంగాధర నెల్లూరు: పారిశుధ్యంతో పాటు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంపై ఇంచార్జ్ ఎంపీడీవో రాఘవేంద్ర రాజు గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంతో పాటు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో రెండురోజులు పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సోమల: స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన సోమల మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికులు సంఘమిత్రలు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. సోమలలో ఎంపీడీవో నారాయణ ఈవోఆర్డీ లక్ష్మీదేవి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సోమల పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, కందూరు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఈకార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం.కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ చంద్రమౌళి అలియాస్ రాజారెడ్డి ఆధ్వర్యంలో కార్వేటి రామనగర్ గ్రామంలో జలజీవన్ మిషన్ కింద బోరు వేసి మోటర్‌ను బిగించారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో గ్రామంలోని మహిళలు నీటి సమస్యలను పరిష్కరించాలని ఖాళీ బిందెలతో ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దీంతో గురువారం ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ గ్రామానికి చేరుకుని బోరు పరిస్థితిని పరిశీలించడంతోపాటు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. అలాగే విద్యుత్ అధికారులను సంప్రదించి త్వరలో ట్రాన్స్ఫార్మర్ బిగించి తాగునీటికి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. పరిష్కరిస్తామని ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ తెలియజేశారు.

ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకు నీటిని అందిస్తున్న దృశ్యం

క్వారీ వద్దు.. భూములే కావాలి..

ప్రజాశక్తి- విజయపురం: గ్రావెల్స్‌కు కేటాయించిన డీకేటీ భూములను రద్దు చేసి నిరుపేదలకు పంపిణీ చేయాలని మండలంలోని పాతార్కాడు వాసులు ఆర్డీవో వెంకటరెడ్డిని కోరారు. దీంతో గురువారం మండలంలోని పాతార్కాడు గ్రావెల్ తరలించే ప్రాంతంలో ఆర్డీవో పరిశీలించారు. అనంతరం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమంగా పలుకుబడి ఉపయోగించుకొని పశు వులమేతకు కేటాయించిన భూములను గ్రావెల్ తరలించడానికి అనుమతి తీసుకున్నారని, ఆ భూములను గుర్తించి వాటిని పూర్తిగా రద్దుచేసి నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని, తమకు కాలుష్యం కలిగించే క్వారీలు వద్దు అని నిరుపేదలకు భూములిచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగరి రూరల్ సీఐ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, వీఆర్వోలు షణ్ముగం, మేఘనాథం, పర్యావరణ నియంత్రణ అధికారులు, సర్పంచ్ భాస్కర్, మాజీ సర్పంచ్ నాగభూషణం యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తున్న ఆర్డీవో వెంకటరెడ్డి

అంగన్వాడీ కేంద్రాలో పౌష్టికాహార మహోత్సవాలు

బైరెడ్డిపల్లిలో..

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పౌష్టికాహార మహోత్సవాల్లో భాగంగా సిడిపిఓ మాధవి లత ఆధ్వర్యంలో గురువారం ధర్మపురి, లక్కనపల్లి, బైరెడ్డిపల్లి 2,3 అంగన్వాడీకేంద్రాల పరిధిలోని గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణులు గర్భం ధరించినప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే ప్రతినెలా డాక్టరు వద్ద వైద్యంతోపాటు సలహాలు తీసుకొని పాటించాలని కోరారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు. సూపర్వైజర్లు రమాదేశి, లతా సుజాత, సిహెచ్ఓ అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని చీకటిపల్లి పంచాయతీలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంగన్వాడీ కేంద్రంలో పోషకాహర పంపిణీ చేశారు. గురువారం గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ తాజ్, సిడిపిఓ కృష్ణవేని, ఐసిడిఎస్ సుజాత, సర్పంచులు నారాయణప్ప, గోపాల్, టిడిపి మండలాధ్యక్షులు టిఎం.బాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి భానుమూర్తి పాల్గొన్నారు.

గుడిపల్లిలో..

క్రైం న్యూస్

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

మృతి చెందిన నాగయ్య, రాజకుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యుదాఘాతంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండలంలో చేటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుండ్ల కట్టమంచి గ్రామానికి చెందిన నాగయ్య (73), ఆయన మనుమడు రాజకుమార్ (22) నాగయ్య ఇంటిలోని ఊయలలో ఊగుతుండగా విద్యుదాఘాతానికి గురైనాడు. గమనించిన నాగయ్య మనుమడు రాజ్‌కుమార్ కాపాడే ప్రయత్నంలో రాజ్‌కుమార్ కూడా విద్యుత్‌షాక్‌కు గురయ్యారు. దీంతో ఇద్దరినీ కుటుంబసభ్యులు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత

నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మండలంలోని గొల్లపల్లెలో ఐదు టన్నుల తమిళనాడు బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం తెలియడంతో ఇన్చార్జి సీఐ లక్ష్మన్న బుధవారం రాత్రి దాడులు చేసి పట్టుకున్న విషయం తెలిసిందే. ఆ బియ్యం కేసులో ఎస్ఆర్.పురం మండలం కొత్తపల్లి మిట్టకు చెందిన సూరి (37), ఇదే మండలానికి చెందిన పుల్లూరు క్రాస్‌కు చెందిన మురుగన్ (37), గంగాధర నెల్లూరు మండలం పాచిగుంట పంచాయతీ గొల్లపల్లెకు చెందిన లోకనాథరెడ్డి (45), తమిళనాడు రాష్ట్రం అమ్మియార్ కుప్పంకు చెందిన అశోక్ కుమార్ (40)లను అదుపులోకి తీసుకొని 41 నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కాగా ఈ కేసులో బియ్యం రవాణాకు వాడిన వ్యాన్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఇన్చార్జి సీఐ పేర్కొన్నారు.

సహకార సంఘం చైర్మన్ మృతి

ప్రజాశక్తి- సోమల:

మండల కేంద్రమైన సోమలలోని ప్రాథమిక పరపతి వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) చైర్మన్ ఏ.వెంకటేశ్వరరావు అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈయన వైద్యుడుగా ప్రజలకు సేవలు అందిస్తూ రాజకీయాలలో అరంగేట్రం చేసి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ముఖ్య అనుచరుడుగా ఉంటూ రెండుసార్లు సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఈయన మృతికి మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాగా ఈయన అంత్యక్రియలు ఒంగోలు జిల్లా నిడమనూరు గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

మత్తుకు దూరంగా ఉండండి: ఎస్ఐ

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

ప్రజాశక్తి- కార్వేటినగరం: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ కుటుంబాలకు అండగా నిలవాలని ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి దళితవాడంలో మత్తు పదార్థాలు వాడకం వల్ల కలిగే అనార్థలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సారా, గుట్కా, గంజాయి వంటి పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటికి బానిసలై కుటుంబాలు వీధిన పడకుండా చూడాలని సూచించారు. గ్రామపరిసరాల్లో సారా తయారీలు, అమ్మకాలు, బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే తమకు సమాచారం అందించాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అక్రమ మద్యం వ్యాపారం నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా భారీన జరీనామాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఏస్ఐ మునికృష్ణ, ఎంపీటీసీ మురగయ్య, మాజీ సర్పంచ్ అంకయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: రాష్ట్ర స్థాయి ఎయిడ్స్, హెచ్ఐవి క్విజ్ పోటీలకు జిల్లా విద్యార్థులలో ఏర్పేడు మండలం బండారుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎస్.చెంచమ్మ ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల, శ్రీలత (యూనిసెఫ్) హైదరాబాద్ వారి ఆద్వర్యంలో సర్టిఫికెట్‌ను విద్యార్థికి అందజేశారు..

శిరస్త్రాణం.. ప్రాణానికి రక్షణ కవచం

ప్రజాశక్తి-దొరవారిసత్రం: ప్రతి ద్విచక్ర వాహన దారులు శిరస్త్రాణం ధరించి ప్రయాణించడం ప్రాణానికి రక్షణ కవచం అని ఎస్ఐ అజయ్ కుమార్ అన్నారు. గురువారం మావిళ్ళపాడు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కళాశాలలో సత్ప్రవర్తనతో మెలగాలని, విద్యాభ్యాసంలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం లేకుండా ప్రయాణిస్తూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. దృష్టిలో ఉంచుకొని రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమలత మాట్లాడుతూ పోలీసుల సూచనలు దృష్టిలో ఉంచుకొని మంచి నడవడికతో మెలగాలని సూచించారు.

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి-రామచంద్రాపురం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కోసం సీనియర్ టిడిపి నాయకులు సైకం జయచంద్ర రెడ్డి రూ.పది లక్షల చెక్కును మంత్రి లోకేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని, బొద్దుల సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.